



సర్పంచిగా ఎన్నికయిం తర్వాత ఏదో రకంగా ప్రధానమంత్రి కావాలని– బతికుండగానే శిలావిగ్రహం ఏర్పాటు చేయించుకోవాలి– క్యూలో నిలబడకుండా కి ర స నా యి లు– డొనేషన్లు కట్టకుండా పిల్లలకు కాన్వెంటులో సీట్లు సంపాదించాలని రామ్మూర్తి ఎప్పుడూ ముచ్చట పడలేదు సరికదా నిజంగా ఆశ పడలేదు.

అసాధారణమైన కోరికలు రామ్మూర్తికి లేవు– అతగాడికున్న చిన్న కోరికల్లా సొంత యిల్లు కట్టుకోవాలని. అందుక్కారణం అతను అద్దెకుంటున్న ఇల్లు అగ్గిపెట్టెలా వుండే రేకులు షెడ్డు కాదు. కరెంటు బిల్లు గురించి అతను గాని– నీళ్ల పంపు గురించి రామ్మూర్తి భార్యగాని ఇంటి యజమానితో వెరైటీ కోసం కూడా పోట్లాడి ఎరగరు.

"ఈ అద్దె కొంపల్లో నేనింక సంసారం చెయ్యలేను... సుబ్బారావుగార్లా మనం కూడా ఎంచక్కా ఇల్లు కట్టుకుంటే...?!"— అని ఆవిడ రామ్మూర్తి చెవిలో మల్టీస్టోరీ బిల్డింగు కట్టలేదు.

రామ్మూర్తికి మందంటే మోజు లేదు– పెళ్లాంతో చట్టాపట్టా లేసుకుంటూ సినిమాలకు తిరగాలన్న షోకు అసలు లేదు. మూడు ముక్కలు తిప్పి గుర్రాలమీద పరిగెత్తే బెంకుల పొట్ట పెంచాలని బొత్తిగా లేదు. అతగాడికున్న ఇష్టమల్లా పూల మొక్కలు పెంచటం, విరగబూసిన పూలను చూస్తూ సమస్యల్ని– ప్రపంచాన్ని మర్చిపోవడం అంటే ప్రాణం.

అవసరమైతే అప్పడగడానికి సంకోచిస్తాడేమోగాని ఎవరింట్లోనేనా కొత్త రకం పూల మొక్క కన్పిస్తే మాత్రం కించిత్ కూడా మొహమాట పడకుండా అడిగి తెచ్చి ఇంట్లో పాత్తాడు.

రామ్మూర్తి ఏ యింట్లో అద్దెకున్నా ఆ యిల్లు అరణ్య మధ్యలో నున్న పర్ణశాలగా మారిపోతుంది. అందుకే రామ్మూర్తి భార్య సంసారం కాకుండా వనవాసం చేస్తున్నట్లు ఫీలవుతుంది.

"అయినా ఈయనకు ఇదేం వెర్రో! కొంపనిండా అడ్డమైన మొక్కలు తెచ్చి పాత్తారు. చోటు చాలకపోతే నా నెత్తినో డబ్బా పెట్టి అందులో ఏ మిరిచెట్లో పాతేలా వున్నారు..."– అని పలుమార్లు మనసులోనూ, సాధ్యమైనన్ని సార్లు భర్తతోనూ అంది. ఎదురుగా రంభ డ్యాన్సు చేసినా చలించని రుషిగార్లా రామ్మూర్తి ముఖంమీద హాసరేఖల్ని గీసేసి జారుకునే వాడు.

ఇల్లు మారవలసి వచ్చినప్పుడు మాత్రం చాక్లెట్లు దొరకని చిన్న పిల్లాడిలా బావురుమంటాడు. ఎంతో ప్రేమగా పెంచుకున్న మొక్కల్ని విడిచి వెళ్లాలంటే గుండె చితికి పోయేది. అలా చీటికి మాటికి గుండె నలిగి పోవడం మంచిది కాదని ఇల్లు కట్టుకోవాలన్న కృత నిశ్చయాని కొచ్చేడు రాంమూర్తి.

నానా అవస్థలు పడి ఆఫీసులో హౌస్

లోన్ గ్రాంటు శాంక్షను చేయించుకున్నాడు. పెళ్ళయ్యాకా ఇద్దరు పిల్లలకు తండ్రికావడం మినహా మరో విషయంలో ప్రయోజకత్వం చూపించని మొగుణ్ణి చూసి బోల్డంత సంతోషించింది రాంమూర్తి భార్య.

..ఇంటి చుట్టూ అందమైన పూల మొక్కలు... పూలతీగెలు ప్రహరీ చూట్టూ, మత్తుగా కదిలే చెట్లగాలి అతని కళ్లల్లో కదిలి కంటిమీద కునుకు లేకుండా చెయ్యడంతో వుబ్బితబ్బిబ్బయ్యేడు... అతగాడి ఆనందానికి అవధి లేదు.

* * *

గాలికి కొట్టుకొచ్చినట్లు అక్కడక్కడ నాలుగైదు ఇళ్లు పూర్తయ్యేయి. అతను కొనుక్కున్న స్థలం దగ్గర మరో జత ఇళ్ళ పునాదులు దాటేయి అవి మినహా, అక్కడ పనిచేసే కూలీల పాకలు తప్ప మరేం లేవు.

ఇంటి పని గురించి మూడు నెలలు ఆఫీసుకు సెలవు పెట్టేడు తన స్థలంలో వున్న తుప్పల్ని కొట్టించేడు. చుట్టూ అందాకా తీగతో కంచెలా ఏర్పాటు చేయించేడు ఓ మూలగా సిమెంటు రేకులతో సిమెంటు వగైరాదులు వుంచడానికి అవుట్ హవుస్‌లా కట్టించేడు

మంచిరోజు చూసి ఇంటికి పునాదివేసేడు.

ఇంటిపని ప్రారంభం కాగానే ప్రహరీ చుట్టూ చెట్లు కూడా నాటించేడు. పనికి అడ్డంరాని చోట్ల పూల మొక్కలు నాటించేడు

రోజూ వుదయం నుంచి సాయంత్రందాకా ఎండలో మల్చుని పన్జేయడం చెడ్డ చిరాకనిపించింది కనీసం ఓ గంట విశ్రాంతి తీసుకోడానికి చుట్టుపక్కల ఓ చెట్టుకూడాలేదు... వున్న ఒక్క చెట్టుకిందా ఓ చిన్న పాక తల దాచుకుంది.

పచ్చగా గుండ్రంగా వుండే రాంమ్మూర్తి పట్టుమని పది రోజులకే చిక్కిపోయిన వాన పాములా తయారైయ్యేడు.

ఆనవాయితీగా ఆ రోజు...

ఎండ ఫుట్‌బాల్ ఆడేస్తోంది. వెచ్చటి గాలి రాంమూర్తి చెంప వాయించేస్తోంది దాహంకి తట్టుకోలేక అప్పటికే చాలాసార్లు మూర్ఛ రోగిలా నీళ్ళు తాగేడు. తన భార్యకు పసుపు, కుంకుమలు నిలవాలంటే చెట్టు నీడకు చేరాల్సిందేననిపించిన వెంటనే మెల్లగా చెట్టు నీడకు చేరేడు.

"కడుతున్న యిల్లు మీదేనేటి బావూ?!!" వెనక నుంచీ వచ్చిన ప్రశ్నకు సమాధానంగా తిరిగి చూసేడు.

"ఏటి బావూ... అలాగే నుల్చుండిపోనారు... మంచంమీన కూకోండి" అన్న ఆతగాడి వొంటిమీద మాసిన పంచె– ఎలభై సంవత్సరాలు మిగిల్చిన అనుభవం తాలూకు మొహంమీద చారలు... నీరసంగా వున్న చూపులు... చూడంగానే సదరు పాకకి యజమాని అతనేనని ఇట్టే పోల్చేసుకోవచ్చు.

కాళ్ళూ పీక్కుపోతుండడంతో మొహమాటం పక్కకుతోసి మంచం మీద కూర్చున్నాడు రాంమూర్తి.

"పాడు ఎండ చంపేస్తోంది" – అని మొహం తుడుచుకున్నాడు రాంమూర్తి.

"మంచినీళ్ళుగాని పుచ్చుకుంటారేటి ?"

"కాసిని...!"

పాక యజమాని మంచినీళ్ళ కోసం ఆర్డరు జారీ చేసేడు.

"పని సెక సెక జరిగిపోతుంది కావోసు!!" మౌనంగా వున్న రాంమూర్తితో అన్నాడు.

ఇంతలో మంచినీళ్ళువచ్చేయి. అందుకుని గబగబా తాగేడు.

'ఇంతకీ నీ పేరు చెప్పలేదు..."

"సింహాచలం..." అని సిగ్గుపళ్లేడు.

"మీది విశాఖ పట్టణమా ?!"

"అవును బావూ! ఇట్టే పోల్చేసుకున్నారు. కాని పన్లు సేసుకుంటూ సిన్నగా స్వదేసం సేరినా."

కొద్ది క్షణాలు ఇద్దరి మధ్య ఏ మాట కదల్లేదు.

సింహాచలం తన సంసారం గురించి–పిల్లల గురించి–కష్టాల గురించి గుక్క తిప్పుకోకుండా, సాగదీసి చెప్పేడు. రాంమూర్తి మనసు వకచక వెన్నలా కరిగిపోయింది...అతని బుల్లి మెదడు ప్రపంచం గురించి పట్టించుకోవడం మొదలుపెట్టింది.

దేశ దరిద్రానికి సింబాలిక్‌గ్గా వున్న సింహాచలం ముగ్గురి పిల్లల్తో సాయంత్రం దాక కాలక్షేపం జరిగిపోయింది.

సాయంత్రం మొక్కలకి నీళ్ళు పొయ్యడంలో సింహాచలం పిల్లలు సాయంచేసేరు. అందుకు ప్రతిఫలంగా జేబులో చిల్లరడబ్బులు వాళ్లకు పంచేడు రాంమూర్తి.

పట్టుమని పది చీమలు కూడా పట్టని ఆ చిన్న పాకలో ముగ్గురు పిల్లలు – భార్య– అతగాడు ఎలా వుండగల్గుతున్నారో ?! – రాత్రిపూట అందరూ కల్సి ఎలా సర్దుకు పడుకుంటారు ?! ... వర్షం వస్తే ?! నిజంగా ఎంత నరకం... ?! ... లాంటి ధర్మసందేహాలు రాంమూర్తిని రాత్రి కునుకు పట్టబోతుండగా చుట్టు ముట్టేయి. కొద్ది పరిచయంలో పేదవాళ్లయినా వాళ్లిచ్చిన మర్యాద–గౌరవం–సంస్కారం రాంమూర్తిని తీవ్ర ఆలోచన్లకు గురి చేసింది.

తనుగా ఆ సంసారానికి ఏదేనా సహాయం చెయ్యగల్నా ?! – అన్న ప్రశ్న రాంమూర్తి ముందు వికృతంగా నిల్చింది.

సమాధానం దొరకలేదు ఆ రాత్రి.

* * *

సింహాచలంతో పరిచయం అయినప్పటి మంచి రాంమూర్తికి ఎండలో నుల్చునే బాధ తప్పిపోయింది. ప్రతిరోజూ మధ్యాహ్నంపూట చెట్టు కింద నులక మంచంలో చిన్న కునుకు తియ్యడం కూడా అలవాటయ్యింది.

సింహాచలం భార్యకు రాంమూర్తంటే చాలా గౌరవం.

తనింటి పనిలోనే సింహాచలాన్ని కుదిర్చేడు –రాత్రిపూట ఇంటికి కాపలాగా నియమించేడు. అంత చిన్నపాకలో కుక్కుకుపోయి, కూరుకుపోయి రోజులు దొర్లించేస్తున్న వాళ్ల సంసారాన్ని పెద్ద ఇంట్లో వుంచలేడు – తను చెయ్యగలిగింది అంతకు మించి లేదు గనుక ఆ కుటుంబానికి ఆర్థికంగా సహాయం చెయ్యగల్గుతున్నానన్న మానసిక తృప్తి కలిగింది రాంమూర్తికి.

అనుకున్న ప్రకారం ఇల్లు పూర్తయ్యింది. పెద్ద ఆర్భాటం లేకుండా గృహప్రవేశం చేసేడు. ఆ సందర్భంలో సింహాచలం కుటుంబానికి కొత్త బట్టలు కూడా పెట్టేడు.

రాంమూర్తి వూహించినట్లు గృహప్రవేశం నాటికి ప్రహరీ చుట్టూ అందంగా చెట్లు పెరిగేయి. సన్నజాజి పందిరి బాగా పెరిగింది. మల్లెపాదలు విస్తరించుకున్నాయి. గులాబీలు విచ్చుకున్నాయి. తన అభీష్టం మేరకు అన్నీ జరగటం అదృష్టంగా భావించేడు.


రాంమూర్తి ఇంటి వరండాలో నుల్చుని చూస్తే చెట్టుకింద సింహాచలం పాక నమ్మకమైన నౌకర్లా పాలైట్‌గాను – అతి బీదగానూ ఒదిగిపోయి కన్పిస్తుంది ఆ చిన్న పాకలో వాళ్ళు పడే ఇబ్బందుల్ని తల్చుకున్న ప్రతిసారీ రాంమూర్తి మనసు వికలమౌతుంది.

## రవి సెక్యూరిటీస్ కంపెనీ

పోస్టుబాక్సు నెం. 4, దేవాలయంవీధి, కాకినాడ.
ఆకర్షణీయమైన వడ్డీరేట్లపై డిపాజిట్లు స్వీకరించబడును. ఒక సం॥నకు 16%, రెండు సం॥లకు 17%, మూడు సం॥లకు 18%. వడ్డీపూర్తి సెక్యూరిటీపై ఇవ్వబడును. కోరిన వెంటనే డిపాజిట్ తిరిగి తీసుకునే సదుపాయం గలదు.

వివరములకు సంప్రదించండి :
ప్రొప్రయిటర్,
చందలాడ వీరభద్రరావు.




## జ్ఞాని

ఏదోరకంగా ఆర్థికంగా సహాయం చెయ్యడం మాత్రం మానలేదు... అయినా తృప్తి చెంద లేదు రాంమూర్తి.

*　　*　　*

కష్టాల్లో దేవుణ్ని రిక్వెస్టుచేసి కొండెక్కి గుండు చేయించుకోవడం, ఉత్తర క్షణం దేవుణ్ని మర్చిపోవడం ఆనవాయితీ. రాంమూర్తి కూడా సామాన్యుల జాబితాలో చేరడంతో దేవుడి గారికి కోపం వచ్చింది. అంతటితో ఆగక తన ఉనికి గుర్తు చేసేడు.

ఆ రోజు... రాంమూర్తి ఆఫీసుకు రాగానే గుండాగినంత పనయ్యింది. చేతిలో ట్రాన్స్‌ఫర్ ఆర్డరు చూసుకోగానే మతిస్థిరం తప్పింది.

ఏది ఏమైనా సరే వూరు మారాల్సిన పరిస్థితి.

గట్టిగా ఆరునెలలు కాకుండానే ఇంత దారుణం జరగడంతో మొగుడితో పాటు రాంమూర్తి భార్య కూడా తల్లడిల్లి పోయింది.

గుండె నాపరాయి చేసుకుని బదిలీ గురించి బెంగపడటం మానేసేడు రాంమూర్తి. అతని దిగులల్లా మొక్కల గురించి, వాటిల్ని వదిలి వెళ్లటం అంటే బతికుండగానే నరకం పోతున్నట్లనిపించింది. ఇల్లు ఇతర్లకి అద్దెకివ్వడం తప్పనిసరి. వాళ్ళు తనంత శ్రద్ధగా మొక్కల్ని పెంచుకుంటారా ?! — అన్న దారుణమైన అనుమానం.

తన బాధ ఎవ్వరికీ చెప్పుకోలేదు ... తన సమస్యకు పరిష్కారం తోచలేదు. అనుక్షణం మొక్కల్ని తల్చుకోగానే కళ్లు చెమర్చేవి. చాటుగా గుక్కపెట్టడం మినహా మరేం చెయ్యలేక పోయేడు రాంమూర్తి.

సతమతమౌతున్న రాంమూర్తికి మెరుపులా ఓ ఆలోచన తళుక్కుమంది — వుత్తర క్షణం సింహాచలంకి కబురు పెట్టేడు.

"...అది సింహాచెలం. మా ఆఫీసులో పన్చేసే ఆయనకు అద్దెకిస్తున్నాను. నాకు మొక్కలంటే ఎంత ప్రాణమో తెల్సుగా?... జాగ్రత్తగా చూస్తానని చెప్పేరు గాని ... ఎంతేనా మనంత శ్రద్ధగా..."

"అదేటి బాఫూ! మీకు దిగులెందుకండే ?! మావుగాని లేవా ?! నా పేణంతో సమానంగా సూసుకుంతాను మీరేటీ దిగులెట్టుకోకండి"—అని సింహాచెలం హామీ ఇచ్చేడు.

"నీ మీద నాకా నమ్మకం వుంది. నువ్వు చూసుకుంటావని తెల్సు. నీకో ఏర్పాటు చేస్తాను. సిమెంటు వుంచడం కోసం కట్టిన రెండు గదులూ శుభ్రం చేయిస్తాను. ఆ చిన్న పాకలో నీ సంసారం ఇబ్బందులు పడే బదులు మీరు అందులో వుండండి. నాకు అద్దివ్వఖర్లేదు. మొక్కల్ని జాగ్రత్తగా చూస్తే చాలు."

"అదేటి బావూ ! మీకులాంటి పెద్దో రిళ్లల్లో మా వెందుకండి...? ! నాను పాకలో వున్నా తవరి కోసరం ఆ పాటి సహాయం పెయ్యనా" అని తన భక్తి ప్రకటించేడు.

"నా కలాంటి భేధాలు లేవని తెల్సుగా. నువ్వు నాకు చేసిన సహాయంముందు ఇదెంత? నా మాట కాదనకు" అంటూ రాంమూర్తి సింహాచెలాన్ని మొహమాటంలో పెట్టేడు. మొక్కలంటే రాంమూర్తికి గల ప్రేమకి, తన లాంటి వాడికి ఇస్తున్న గౌరవం - ఆదరణ తల్చుకోగానే సింహాచెలం తన అంగీకారాన్ని — సహకారాన్నీ అందిస్తానని మనస్ఫూర్తిగా హామీ ఇచ్చేడు.

రాంమూర్తి పెరట్లోని రేకుల షెడ్డుని శుభ్రం చేయించేడు. నివాస యోగ్యంగా తయారయ్యింది. తన కుటుంబానికి ఓ ఆసరా కల్పిస్తున్నందుకు సింహాచెలం అమితానంద పడ్డాడు. రాంమూర్తి భార్య కూడా భర్త చేస్తున్న మంచి పనికి అడ్డు చెప్పలేదు.

రాంమూర్తి గొప్ప మనసుకి జోహార్లర్పించేడు.

* * *

హైద్రాబాదు నుంచి బదిలీ అయివచ్చి చాలా రోజులైనా రాంమూర్తికి ఇంటి మీద మొక్కల గురించి దిగులు మాత్రం పోలేదు. నెలకు రెండుసార్లు సింహాచెలం మొక్కలు ఎలా ఎదుగుతుంది—ఏ మొక్కలు ఎన్ని పూలు పూసింది ఆదిగాగల వివరాల్తో ఉత్తరాలు రాయిస్తున్నాడు. ఉత్తరం అందుకున్నప్పుడల్లా మనసు ప్రశాంతంగా వుండేది రాంమూర్తికి.

అనుకోకుండా ఆఫీసు పని మీద హైద్రాబాదు వచ్చే అవకాశం వచ్చింది. ముందుగా సింహాచెలంకి ఉత్తరం రాసే సమయం చిక్కలేదు.

హైద్రాబాదు వచ్చింది ఆఫీసు పని మీదే అయినా మనసంతా ఇంటిమీద, మొక్కల మీదే వుంది. గబగబా పని ముగించుకొని స్వంత ఇంటి దారి పట్టేడు.

పదినెలల్లో ముఖ్యంగా తను ఇల్లు కట్టు కొన్న ప్రాంతంలో వచ్చిన మార్పులు చూడంగానే ఆశ్చర్యం వేసింది రాంమూర్తికి. అరగజం చోటు లేకుండా ఇళ్లు వెలిసేయి... మంచి రోడ్లు వేసేరు. కార్పొరేషన్ వీధి దీపాలు, బస్‌స్టేజీలు, కిరాణా దుకాణాలు...

దగ్గరౌతున్న ఇల్లు చూడంగానే అడుగులు వేగంగా పడ్డాయి ... చెట్లు బాగా ఎదిగిపోయున్నాయి, చెట్ల మధ్య గూటిలో పక్షిలా ఇల్లు ఆనందంలో వుక్కిరిబిక్కిరై య్యేడు. గబగబా సింహాచెలంకి, మనసులో అతని సహాయంకి కృతజ్ఞతలు చెప్పుకొన్నాడు.

గేటు దగ్గర నుంచి వరండాదాకా నీలం పూల పందిరి. విరబూసిన పూలు స్వాగతం చెప్పేయి. అవధిలేని ఆనందం రాంమూర్తిని మరో లోకంలోకి లాక్కుపోయింది.

రాంమూర్తి ఇంట్లో అద్దెకుంటున్న ఆసామి శిలలా బిగుసుకుపోయిన యజమానిని చూసి పలకరించేడు. కుశల ప్రశ్నలు ముగిసిం తర్వాత ఇబ్బందిగా కప్పడు కాఫీ తాగి సింహాచెలం కోసం పెరటి వైపుకి వెళ్లేడు.

అక్కడ కూడా మొక్కలు అందంగా పెరిగేయి. రాంమూర్తికి విపరీతమైన ఆనందంలో గుండె ధడేల్‌మని పగిలేలావుంది. దానికి కారణం సింహాచెలం కావడంతో అతగాడ్ని అభినందించందే ఆలోచన్లు స్థిరంగా వుండేలా లేవనిపించి—

"సింహాచెలం..."—అని పిలవలేదు, దాదాపు అరిచేడు.

ఆ అరుపుకి ఓ స్త్రీ బయటి కొచ్చింది. ఎదురుగా మొక్కల్ని చూస్తూ తనలో తాను నవ్వేసుకుంటున్న రాంమ్మూర్తిని చూసి పిచ్చివాడనుకుంది. రాంమూర్తి తన్మయత్వం లోనించి బయటకొచ్చి మరోసారి పిలవ బోయేడు.

"సింహాచెలంలేడా" అడిగేడురాంమూర్తి,

"అతనుండేది ఇక్కడ కాదు..."

"మీరు...?!!" అప్రయత్నంగా అడిగేడు.

"ఈ ఇంట్లో అద్దెకుంటున్నాం..." బోల్డంత ధీమాగా అంది.

మరో ప్రశ్న వేసే లోపలే ఆవిడ వెళ్లి పోయింది.

రాంమ్మూర్తి బయటకు ఎలా వచ్చాడో అతనికే తెలియదు.

రోడ్డుమీదకొచ్చి యాంత్రికంగా ఆగేడు.

ఎదురుగా కొత్తగా వెలుస్తున్న ఇంటి పక్కన చెట్టుకింద పాక ఇదివరకటి లాగానే వుంది. పాకలో దీపం మినుకు మినుకు మంటోంది సింహాచెలం పాక వినయంగానూ, సిన్సియర్‌గానూ కన్పించలేదు.

సింహాచెలాన్ని పలకరించాలనిపించలేదు. అతగాడి లౌక్యం తల్చుకోగానే అడుగులు వడివడిగా పడ్డాయి రాంమూర్తికి. ఇంత కాలం అద్దెకిచ్చి తనకు కనీసం ఒక్క మాట కూడా వుత్తరంలో ఆ విషయం రాయని సింహాచెలంని తల్చుకోగానే అసహ్యమేసింది.

రాంమూర్తి ఇప్పుడు మొక్కల గురించి ఆలోచించటం లేదు, మనుషుల గురించి తప్ప !!

